క్లుప్తంగా

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

దొనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ గుంటు పోలయ్య తెలిపారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, వార్డు మెంబర్లు తప్పక హాజరుకావాలని పోలయ్య కోరారు.

15న ఛలో విజయవాడ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అంజయ్య

దొనకొండ: ఈ నెల 15న ప్రజా రక్షణ భేరి ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల సీపీఐ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య కోరారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం ఛలో విజయవాడ కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ పాలనలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ఏకపక్షంగా నిర్ణయాలు రుద్దుతుందని, సామాజిక న్యాయాన్ని తూట్లు పొడుస్తుందన్నారు. పలు సమస్యల గురించి సీపీఎం ఆధ్వర్యంలో 15న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కుందుర్తి అనిల్, సంతోష్‌కుమార్, కిరణ్‌బాబు, శ్రీకాంత్, జాన్‌బాబు, పెద్దముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి



ఎస్సై వేముల సుధాకర్

తర్లుపాడు: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల నిర్వాహకులు పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్ స్పష్టం చేశారు. తయారీదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బాణసంచా, పేలుడు పదార్థాలు ఇంటిలో నిల్వ ఉంచరాదని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయించాలని చెప్పారు. ప్రమాదాల బారి నుంచి రక్షణకు దుకాణాల వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్లు వద్ద కోటా సత్యమాంబదేవి ఆలయం, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ దేవస్థానాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు చేసి అఖండ హారతి ఇచ్చారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ప్రజా రక్షణభేరి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గిద్దలూరు రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న ప్రజా రక్షణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆవులయ్య, పూర్ణ, నరసింహులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుపై ప్రత్యేక దృష్టి



సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సేథుమాధవన్



బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్ నయీం అహ్మద్

పుల్లలచెరువు: ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌పై సాధించాలని మండల రెవెన్యూ అధికారి ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలపై 4, 5 తేదీల్లో పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ తొలగింపులు, చేర్పులు, అభ్యంతరాల నమోదును ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలను పరిశీలించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా 18 ఏళ్లు నిండిన వారుంటే గ్రామాల్లో ఉన్న బీఎల్వో వద్ద నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకట సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

మార్కాపురం: మండలంలోని రాయవరంలోని బీఎల్ఓ కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ సేథుమాధవన్ సందర్శించారు. ఓటరు నమోదు, మార్పుల చేర్పుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, ఓటరు జాబితాలో మార్పులు చేర్పుల వివరాలు పారదర్శకంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మంజునాథరెడ్డి, అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

బీఎల్ఓలు బాధ్యతగా పనిచేయాలి

ముండ్లమూరు: అర్హులందరికీ ఓటు కల్పించడంలో బీఎల్ఓలు పాత్ర కీలకమని తహసీల్దార్ నయీం అహ్మద్ తెలిపారు. మండలంలోని శంకరాపురం, వేంపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలో 218, 219, 233,234 పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి ఓటు నమోదులో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి యువకునికి ఓటు కల్పించాల్సి ఉందన్నారు. అందుకోసం ఓటు దరఖాస్తులను తీసుకొని నమోదు చేయాలన్నారు. ఫారం 8 ద్వారా చేర్పులు, మార్పులను చేయవచ్చన్నారు. ఆయన వెంట బీఎల్ఓలు శాంతిప్రియ, అయ్యప్పరెడ్డి, రాఘవ, సిబ్బంది దేవకాంత్ తదితరులు ఉన్నారు.



పుల్లలచెరువు లో నూతన ఓటర్‌గా నమోదు చేసుకుంటున్న దృశ్యం.

సామాజిక సాధికార యాత్రకు తరలిరండి

● మాజీ ఎమ్మెల్యే ఉడుముల



సమావేశంలో మాట్లాడుతున్న ఉడుముల

కొనకనమిట్ల: మార్కాపురం పట్టణంలో సోమవారం సాయంత్రం నిర్వహిస్తున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి కోరారు. ఆదివారం సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. గొట్లగట్టులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఉడుముల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ వారికి అన్ని విధాలా న్యాయం చేస్తున్నారన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మార్కాపురంలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతుందని, ముఖ్యమంత్రిగా జగనన్నను మరోమారు గెలపించుకుందామన్నారు. సమావేశంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గోనుగుంట్ల శ్రీనివాసులు, ఉప్పుటూరి పెదవెంకటయ్య, సచివాలయ కన్వీనర్లు అనుకు ఏడుకొండలు, ఎన్ వెంకటేశ్వర్లు, మందలపు శ్రీనివాసులరెడ్డి, పి.నారాయణరెడ్డి, ఎస్ ప్రసాద్, ఉన్నం శ్రీనివాసులు, దారకమల్లి, కమలయ్య పాల్గొన్నారు.

వర్షంపై రైతుల హర్షం



చిన్నారికట్లలో కురుస్తున్న వర్షం

కొనకనమిట్ల: మండలంలో రెండు రోజులగా కురుస్తున్న మోస్తారు వర్షానికి భూములు పదునెక్కాయి. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో జనం ఉపశమనం పొందారు. ఖరీఫ్, రబీలో సాగు చేసిన పత్తి, కంది, అలసంద, మినుము, పొగాకు పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మతల్లి

మార్కాపురం టౌన్: మార్కాపురం శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలతోపాటు వేములకోట, సీతానాగులవరం, రామచంద్రపురం తదితర గ్రామాల భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మహిళా భక్తులు అమ్మవారికి చీర, గాజులు సమర్పించారు. ఈవో చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గిద్దలూరులో మెగా నేత్ర వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: వివేకానంద కళాశాలకు చెందిన 1983, 85, 88వ సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థుల గెట్ టూ గెదర్ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శాంతిరామ్ వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నగర పంచాయతీ కమిషనర్ వై.రామకృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా నేత్ర వైద్యం చేయించి, మందులు అందించడం అభినందనీయమన్నారు. ఉచితంగా ఆపరేషన్లు చేయించి, కళ్లజోళ్లు పంపిణీ చేయాలని నిర్ణయించడం పేదలకు ఉపయోగకరమన్నారు. 140 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తులసీబాబు, హనుమంతారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో గృహాలు ప్రారంభం



గృహాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెంలో జగనన్న కాలనీలో గృహాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. పూజల అనంతరం గృహ ప్రవేశ కార్యక్రమాలు పండగ వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఉడుముల మాట్లాడుతూ.. ఇళ్లు కాదు, ఊళ్లు నిర్మిస్తామని చెప్పిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నారని పేర్కొన్నారు. పక్కా ఇళ్లు సొంతం చేసుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, మోరబోయిన మురళి, సొసైటీ అధ్యక్షులు అనికాళ్ల ఈశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ పెమ్మని ఓంకార్, కొనకనమిట్ల సచివాలయాల కన్వీనర్ ఎస్.పెద్ద వెంకటరెడ్డి, కన్వీనర్లు డి.శ్రీనివాసరెడ్డి, మోరా శంకరరెడ్డి, గుంటూరు పిచ్చిరెడ్డి, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, చిమటా నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల, తెలికుల శంఖారావాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గురుస్వామి

పొదిలి: రాజమండ్రిలో ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకులు తంగెళ్ల నాగభూషణం, చిట్టెంశెట్టి చిన సుబ్బారావు కోరారు. ఆదివారం స్థానిక యూనిట్ ఆధ్వర్యంలో చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, దాసరి గురుస్వామి మాట్లాడుతూ.. డిసెంబర్ 3న స్థానిక దర్శి రోడ్డులోని గోశాలలో నిర్వహించనున్న కార్తీక వనభోజన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. కుల గణన సమయంలో గాండ్ల, తెలికుల, దేవతల విభాగాలుగా మాత్రమే నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర నాయకులు గుంటక కృష్ణ, సిహెచ్.శ్రీనివాసులు, భీమవరపు సహదేవుడు, యువజన సంఘ జిల్లా అధ్యక్షుడు బోయిల్ల రోషన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తే ప్రజల మన్ననలు



వైద్యాధికారి జ్యోతిని సన్మానిస్తున్న వైద్యాధికారులు

ముండ్లమూరు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తే ప్రజల మన్ననలు పొందవచ్చని ఒంగోలు మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ మనోహరరెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ జ్యోతి ఉన్నతి విద్య జనరల్ మెడిసిన్ చేసేందుకు వెళ్తున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా జ్యోతి చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. ఉన్నతి విద్యనభ్యసించి ఇంకా మరిన్ని సేవలు అందించాలని కోరారు. అనంతరం ఆమెకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైద్యాధికారులు జాస్మిన్, ప్రవీణ్‌కుమార్, సుమన్, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, యుగంధర్, ప్రసాద్, మాధవి, నాగార్జున, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు



గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దదోర్నాల: సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండల పరిధిలోని చిన్న గుడిపాడులో గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా పడాలని, పాడి పంటలు అభివృద్ధి చెందాలని గంగమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లిని గ్రామంలోని వీధుల్లో కొమ్ము బూరాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో మహిళలు వారు పోసి ఊరేగింపునకు స్వాగతం పలికి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువుకట్ట వద్దకు చేరుకుని గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలను గ్రామ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

రాచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రాచర్ల ఫాం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. అనుములపల్లె గ్రామానికి చెందిన బి.రంగనాయకులు అనే వ్యక్తి తన బైకుపై గిద్దలూరు నుంచి అనుములపల్లె గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో గిద్దలూరుకు బైకుపై వెళ్తున్న గుర్తుతెలియని మరో వ్యక్తి రాచర్ల ఫాం గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొనడంతో రంగనాయకులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో గిద్దలూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై ఆదిశేషయ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని బురుజుపల్లె గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. బురుజుపల్లె గ్రామం నుంచి మహిళా కూలీలతో వస్తున్న లగేజీ ఆటోను ముండ్లపాడు గ్రామానికి చెందిన శిరిగిరి తేజ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శిరిగిరి తేజ, లగేజీ ఆటోలో ప్రయాణిస్తున్న శింగంపల్లెకు చెందిన మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

వాల్యూ ఎడ్యుకేషన్-2023కు నవోదయ విద్యార్థి ఎంపిక

తర్లుపాడు: ఇస్కాన్ ఇంటర్నేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ వాల్యూ ఎడ్యుకేషన్ ఒలంపియాడ్-2023కి మండలంలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ సమితి 8వ తరగతి విద్యార్థి జైదీప్‌రెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బీఈజీ ప్రసన్నకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జైదీప్ రెడ్డి బీ కేటగిరీలో మూడో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థి తలిదండ్రులను, సైన్స్ టీచర్(మెంటార్) ప్రియాంకను ప్రిన్సిపాల్ అభినందించారు.

అనాథ మహిళకు ఆర్థిక సహాయం

పెద్దదోర్నాల: మండల కేంద్రానికి చెందిన నిరుపేద అనాథ మహిళకు మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముంతాజ్ అనే నిరుపేద మహిళకు గ్రైండర్, కుట్టుమిషన్‌లతో పాటు బియ్యం, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ బాబు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమద్, సెక్రటరీ ఖాసిం, జాయింట్ సెక్రటరీ మహబూబ్‌బాష, ట్రెజరర్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఒక మోస్తరు వర్షం..రైతులు హర్షం

త్రిపురాంతకం: త్రిపురాంతకంతో పాటు పరిసర గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. దాంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట పైర్లు వేసిన రైతాంగం వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల కొన్ని రోజులుగా వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో బోర్ల కింద వ్యవసాయం చేస్తున్న రైతాంగం మెట్టపైర్లకు ఈవర్షం ఎంతో ఉపయోగపడుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా వర్షాలు కురిస్తే వేసిన పంటలు చేతికంది మంచి ఫలసాయం పొందవచ్చని రైతులు ఆశాభావంతో ఉన్నారు.